# తల్లా? పెళ్ళామా?

ప్రపంచం చాలా చిత్రమైనది. కనిపించేదంతా మనకు అర్థమైనట్లే ఉంటుంది. కానీ మనకు ఏమీ అర్థం కాదన్న విషయం తరచి ఆలోచిస్తేగాని తెలియదు. విత్తనం లోంచి మొక్క మొలుస్తోంది. అదే మహా వృక్షమవుతోంది. కొన్ని వృక్షాలు పుష్పిస్తాయి. కొన్ని పుష్పాలు ఫలిస్తాయి. ఏ చెట్టు ఎలా బయలుదేరిందో, ఏది ఏ కాయలు కాస్తుందో అన్నీ

మనకు తెలుసు. ఆ విషయంలో అన్నీ మనకు తెలిసినట్లే ఉంటుంది. కానీ అవన్నీ అలా ఎందుకు చేస్తున్నాయన్న ఆలోచన విజ్ఞానానికి అందనిది. అయితే అందని పళ్ళు పులుపు అన్న సామెత విజ్ఞానానికి వర్తించదు. అందని వాటిని సాధించే వరకూ ప్రయత్నాలను కొనసాగించడమే విజ్ఞుల ధ్యేయం. విజయం లభించే వరకూ ప్రయత్నాలను కొనసాగించు కుంటూ పోవడమేగానీ ఓటమి నెరుగని తత్వం విజ్ఞానిది.

నిజంగా ఇంతవరకూ కమలాకరం తల్లి ప్రేమలోని విశిష్టతను గురించి ఆలోచించలేదు. తల్లిని మించిన ప్రేమమూర్తి ఈ పృథ్విలో మరి ఉండదని అతను ఇంతకాలమూ భావించాడు. అంతేకానీ శాస్త్రీయ సూత్రాలవలే ఈ విషయాన్ని కూడా కొన్ని కోణాల్లో పరిశీలించి చూస్తే ఆశ్చర్యకరమైన విషయాలు బయటపడుతాయని అతను అను కోలేదు.

ఇంతవరకూ జరిగిందేమిటంటే కమలాకరం ఒక రోజున భార్యా సమేతంగా ఒక స్నేహితుని ఇంటికి తేనీటి విందుకు వెళ్ళాడు. ఆ స్నేహితుడి పేరు సీతారామం. కమలాకరం అతని భార్య సుభద్ర, సీతారాం, అతని భార్య మీనాక్షి, జనార్ధనం అనే మరో అతనూ ఆ పార్టీకి హాజరయిన సభ్యులు. జనార్ధనం కూడా వివాహితుడే కానీ అతని భార్య ప్రస్తుతం పుట్టింట్లో ఉంది.

సృష్టి చిత్రాల్లో సంభాషణ ఒకటి. అది ఎక్కడ మొదలై ఎక్కడ అంతమవుతుందో చెప్పడం కష్టం. తెగిన గాలిపటం ప్రయాణంలా కొనసాగే సంభాషణలో ఏయే విషయాలు చోటుచేసుకోబోతున్నాయో ప్రారంభంలో ఎవరూ చెప్పలేరు.

మీనాక్షిగారి వంటను కమలాకరం మెచ్చుకోవడంతో సంభాషణ మొదలై రకరకాల తినుబండారాలూ, అవి చేసే విధానాల మీదకు సంభాషణ మళ్ళింది. ఆ సందర్భంలో సుభద్ర ఏవి బాగా చేయగలదో, మీనాక్షి ఏవి బాగా చేయగలదో, జనార్ధనం భార్య ఏవేవి బాగా చేయగలదో అందరూ తెలుసుకున్నారు. తను బాగానే చేయగల తినుబండారాలు తన తల్లయితే ఇంకా బాగా చేయగలదని మీనాక్షి అంది. వెంటనే జనార్ధనం అందుకుని మా అమ్మలా పాకం ఉండలు ఎవ్వరూ చేయలేరన్నాడు. అని ఊరుకోలేదు. అవి తనకెంతో ఇష్టమనీ తనెప్పుడు వెళ్ళినా తల్లి తనకోసమని అవి ప్రత్యేకంగా చేసి పెడుతుందని పాకం ఉండలు చేయడం తన భార్య కంత బాగా రాదనీ, చేసినా తనకు అవి నచ్చవనీ అతనన్నాడు.

"మీ ఆవిడ ఊళ్ళో లేదు కాబట్టి ధైర్యంగా ఈ మాట చెప్పగలిగారు" అంటూ మీనాక్షిగారతన్ని వేళాకోళం చేసింది."

"నాకేం భయమనుకున్నారా.. మా ఆవిడున్నా ఇదే మాటంటాను. అసలు మా ఆవిడ పాకం ఉండలు బాగా చేయకపోవడానికో కారణం ఉంది. ఆవిడ గారికవి సయించవు.

"అదీ సంగతి" అన్నాడు సీతారామం.

"మరి మా అమ్మకీ తీపి సహించదు. అయినా నా కిష్టమని బందరు లడ్డూ ఎంతో బాగా చేస్తుంది!" అన్నాడు కమలాకరం.

సమయం కోసం వేచి ఉన్నట్లుగా జనార్ధనం అందుకున్నాడు. "అక్కడే ఉంది తేడా! తల్లి అభిమానం వేరు. పెళ్ళాం అభిమానం వేరూను. ఎన్నుకున్నా తల్లికున్న ప్రేమ పెళ్ళానికెలా ఉంటుంది?"

వెంటనే వాతావరణం నిశ్శబ్దంగా మారిపోయింది. ఎవ్వరూ మాటాడలేదు. సుభద్రకీ, మీనాక్షికీ మనస్సు చివుక్కుమంది. వాదన నిష్పక్షపాతంగా నడిపించడానికి ఎదురుగానే భార్యలున్న కమలాకరానికీ, సీతాపతికీ కష్టమనిపించింది. భార్య దగ్గర లేకపోవడంవల్ల జనార్ధనం ధైర్యంగా ఈ స్టేటుమెంటు ఇచ్చి వూరుకున్నాడు.

కమలాకరం ఆలోచిస్తున్నాడు. తల్లి ప్రేమ చాలా గొప్పదే! కానీ మరి భార్య ప్రేమ?.. తన భార్య తన్ను మనస్ఫూర్తిగానే ప్రేమిస్తోంది. తన కోసం తన వారందర్నీ వదులుకుని వచ్చేసింది. అటువంటి ఆమె ప్రేమ తల్లి ప్రేమతో పోల్చగానే విలువలేని దయిపోయిందా?

ఇంతలో సీతాపతి అందుకున్నాడు - "టెన్నిస్‌లో ప్రస్తుతం రాడ్ లేవర్ గొప్ప ఆటగాడు. క్రికెట్‌లో నా దృష్టిలో గారిఫీల్డ్ సోబర్స్ గొప్ప ఆటగాడు. అయితే వీరిద్దర్నీ పోల్చి ఎవరు గొప్ప అన్నది తేల్చగలమా? రెండూ ఆటలే - కానీ రెండు రకాల ఆటలు. అలాగే తల్లివీ, భార్యవీ రెండు రకాల ప్రేమలు. ఇద్దరి దృష్టులూ వేరు. కాబట్టి ఇద్దరి ప్రేమలూ గొప్పవే."

జనార్ధనం అంత సులభంగా అంగీకరించలేదు. 'రెండు రకాల అటలనూ - ప్రేమ రకాలతో పోల్చలేము. ఇక్కడ అంత భేదం లేదు. నేను మరో ఉదాహరణ చెబుతాను. పాశ్చాత్య సంగీతం బాగుటుందా, కర్ణాటక సంగీతం బాగుంటుందా అన్న చర్చ ఉందనుకోండి. రెండు సంస్కృతులకి చెందని మరొకడు ఆ రెంటినీ విని మంచిచెడ్డలను చెప్ప గలుగుతాడు. భార్య ప్రేమనీ, తల్లి ప్రేమనీ పాశ్చాత్య, కర్ణాటక సంగీతాలతో పోల్చవచ్చు. ఈ రెండు సంగీతాలలో ఓ సంగీతం మాత్రమే గొప్పదని నేను కచ్చితంగా చెప్పగలను. కాబట్టి...."

"అక్కడ ఆగండి!" అన్నాడు కమలాకరం, "అందరూ కర్ణాటక సంగీతం విని ఆనందించలేరు. అందరూ పాశ్చాత్య సంగీతం విని ఆనందించలేరు. మీరు చెప్పినదాని ప్రకారం వారి వారి అభిరుచుల్ని బట్టి వాటి గొప్పదనం మారినట్లే మనిషి మనస్తత్వాన్ని బట్టి ఏది గొప్పో నిర్ణయమవుతుందంటారా? అలాగయితే అది ఒక వ్యక్తిగత నిర్ణయంగా ఉండిపోతుంది తప్ప సాధారణ నిర్ణయంగా ఉండదు."

జనార్ధనం ఆలోచించేలోపల సుభద్ర అందుకుంది. 'పాతికేళ్ళదాకా బాగా ప్రేమించొచ్చునేమోగాని, పెళ్లాయాక అబ్బాయి మీద తల్లికి పూర్వపు ప్రేమ ఉండదండి.'

జనార్ధనం నవ్వి, "అదంతా యెందుకు...మొన్న మీరూ, మీ వారూ వెళ్లారు గదా..మీ అత్తగారు మిమ్మల్ని వంటచేయనిచ్చిందా? తానే స్వయంగా చేసి కొడుక్కి పెట్టుకోలేదూ" అన్నాడు.

సుభద్ర నోరు మూతపడుతుండగా మీనాక్షి అందుకుంది - "ఒకటి రెండ్రోజులయితే

యెవరయినా అంతే. ఆ మధ్య మా అత్తగారిక్కడికొచ్చినప్పుడు నేనే వాళ్లందరికీ వండి పెట్టాను.''

''ఏదో..వాదనని సమర్థించుకుందుకు ప్రయత్నిస్తున్నారు'' - అన్నాడు జనార్ధనం.

''పాపం...మీరు ప్రయత్నించడం లేదు'' అన్నాడు సీతారామం.

అందరూ తనకు వ్యతిరేకమయిపోయినట్లు తోచి జనార్ధనం వాదన ఆపేశాడు. సంభాషణ అనుకోకుండానే సినిమాల మీదకు మళ్ళింది.

అలా మధ్యలో సంభాషణ ఆగిపోవడం కమలాకరానికి నచ్చలేదు.అనుకోని ప్రస్తావన వచ్చింది. నిజానిజాలు తేలకుండానే మధ్యలో చర్చ ఆగిపోయింది. నిజానికిద్దరిలో ఎవరు గొప్ప?

తనకు తలనొప్పి వస్తే గిలగిల్లాడిపోతుంది సుభద్ర. చిన్నప్పుడు అమ్మ కూడా అలాగే ఉండేది. తనకు జ్వరం వచ్చినప్పుడల్లా రాత్రి తెల్లవార్లూ నిద్ర పోకుండా సేవలు చేసింది సుభద్ర. చిన్నప్పుడు అమ్మ కూడా అలా చేసింది. ఉన్నట్లుండి ఓ విషయం స్ఫురణకు వచ్చిందతనికి. తన పుట్టిన రోజుకి చీర కొనలేదని సుభద్రకి చాలా కోపం వచ్చిందొకసారి. అమ్మెప్పుడూ తన దగ్గర్నుంచి యే విధమైన ప్రతిఫలమూ కోరలేదు.

ప్రతిఫలం కోరని ప్రేమ తల్లిది. స్వార్థంతో కూడిన ప్రేమ భార్యది. తప్పకుండా మొదటిదే గొప్పది. ఈ విషయం తట్టగానే పైకి అనేద్దామనుకున్నాడుగానీ సుభద్ర, మీనాక్షి ఎదురుగా ఉండగా ఆ మాట అనడానికి అతనికి ధైర్యం చాలలేదు.

అందరూ పేకాటలోకి మళ్ళగానే కమలాకరం ఈ విషయం మరిచిపోయాడు. పేకాట ముగిసేక ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. టైము రాత్రి తొమ్మిదయింది. భోజనం చేశాక భార్యాభర్తలిద్దరూ స్నానాలు చేశారు. కమలాకరం ఏదో మాగజైన్ తిరగేస్తూ మంచం మీదకు ఒరిగాడు. అంతలోనే అతని చేతిలోని మాగజైను ఎవరో లాగేశారు. అతను చిరాగ్గా చూశాడు. మల్లెపువ్వులాంటి చీరతో, తలలో మల్లెపూలతో సుభద్ర దరహాసం చేస్తోంది. అతని చిరాకు తగ్గి పోయింది.

''ఏదో సరదాగా లాగేశాను. చదువుకోండి'' అందామె.

''ఊహూ..'' అంటూ అతనామె చేయి పట్టుకు లాగాడు. ఆమె నవ్వుతూనే అతని మీదకు ఒరిగిపోయింది., ఆవేశంగా ఆమె ముఖం లోకి చూస్తున్న కమలాకరం ఉలిక్కిపడ్డాడు.

అందమైన ఆమె మందహాసం వెనుక దాగి ఉన్నది స్వార్థం. ఆమెకు తన మీద ప్రేమ ఉంది. కానీ ఆ ప్రేమ వెనుక దాగిఉన్న స్వార్థం... ఎందుకో అతని మనసు పాడయింది. ఇంక ఆమె వంక చూడలేక..''దీపం తీసేయ్'' అన్నాడు. అందుకు కారణాన్ని మరో విధంగా అర్థం చేసుకోవడం వల్ల స్విచ్ ఆఫ్ చేస్తూ నవ్వుకోగలిగిందామె.

పది రోజుల అనంతరం అతనికి తల్లి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. ఉత్తరం చదవగానే అతనికి చాలా బాధ కలిగింది. పంపించే డబ్బు సరిపోవడంలేదని రాస్తూ చిన్నప్పట్నుంచీ కష్టపడి పెంచి ఇంత వాణ్ణి చేసినందుకు ఇదేనా ప్రతిఫలం అని ప్రశ్నిస్తూ

తల్లిదండ్రుల్ని నిర్లక్ష్యం చేయడం పాపమని హెచ్చరిస్తూ ఉత్తరం ముగించిందామె.

ఆ ఉత్తరంలోని - 'ఇదేనా ప్రతిఫలం' అన్న వాక్యం అతన్ని బాగా గాయపరిచింది. నిజానికి అతను శక్త్యానుసారం ప్రతి నెలా తప్పకుండా తలిదండ్రులకు డబ్బు పంపిస్తూనే ఉన్నాడు. ఇంకా ఎక్కువ పంపించాలని కూడా అనుకున్నాడు. పంపించగల స్తోమత కూడా అతనికుంది. నెలకు ఆరు వందలొస్తున్నాయి. ఇన్నాళ్ళూ ఇంటికి నెలకు వంద రూపాయలే పంపిస్తున్నాడు. మరో యాభయ్యో వందో పంపించవచ్చు. తల్లి మరో విధంగా అడిగివుంటే అతను ఇంత బాధపడి ఉండేవాడు కాదు. కానీ, 'ఇదేనా ప్రతిఫలం' అన్న వాక్యం అతన్ని బాధిస్తోంది.

ఏ విధమైన ప్రతిఫలాన్నీ కోరకుండా తల్లి తన్ను ప్రేమించిందని అతను నమ్మాడు. అటువంటి తల్లి ప్రతిఫలాన్ని కోరింది. అయినప్పుడు ఆమె తన భార్య కంటే గొప్పదెలా అవుతుంది? అదోరకమైన బాధతో అన్యమనస్కంగా అడుగు పెట్టిన కమలాకరానికి గుమ్మంలో చిరునవ్వుతో ఎదురయింది భార్య.

"మీరు కోపగించుకోనంటే ఒక విషయం చెబుతాను" అంది బూట్లు విప్పుతూ, ఆమె. "చెప్పు" అన్నాడు చిరాగ్గా. తన ఉత్సాహంలో ఆమె అతడి చిరాకును గమనించలేదు. "ఏడు నెల్ల క్రితం మీరు నా పుట్టిన రోజుకి చీర కొనలేకపోయారు. అందుకని ప్రతీ నెలా నాకు 15 రూపాయలు ఇవ్వడానికి నిర్ణయించుకున్నారు. అవునా?"

"ఊ..." అన్నాడతను.

"మొత్తం నూటయిదు రూపాయిలయింది కదా. ఈ రోజు ఉదయం బజారుకెళ్ళి ఇది కొన్నాను.." అంటూ ఒక ప్యాకెట్ తీసి మంచం మీద పడేసింది ఆమె.

"బాగుందిలే" అన్నాడతను ప్యాకెట్ విప్పకుండానే విసుగ్గా.

"చూసి చెప్పాలమ్మా మరి, అది చూసేలోపులో కాఫీ తీసుకొస్తాను," అంటూ వంటింట్లోకి పరుగెత్తింది సుభద్ర. అన్యమనస్కంగా ప్యాకెట్ విప్పిన కమలాకరం ఉలిక్కిపడ్డాడు. అందులో టెరిలిన్ ప్యాంటు గుడ్డా షర్టు గుడ్డా ఉన్నాయి. ఒక్క నిముషం అతని మెదడు పనిచేయలేదు. ఏంచేయాలో తెలియక..."సుభద్రా," అని గట్టిగా పిలిచాడు.

"వస్తున్నా"..అంటూ ఉల్లిగారెలు రెండు ప్లేట్లలో వేసి పట్టుకొచ్చింది సుభద్ర.

"ఏమిటిది?" అన్నాడు జనార్థనం.

"మీకు నచ్చలేదా?" అందామె అమాయకంగా.

ఆ దృష్టితో చూడని కమలాకరం ఓసారి వాటిని పరిశీలించి చూశాడు. నిజానికి సెలక్షన్ చాలా బాగుంది. "బాగున్నాయి కానీ ఎందుక్కొన్నావిప్పుడు?" అడిగాడతను.

"అదేమిటండీ అలా అడుగుతారు? ఇది నా డబ్బు. నా ఇష్ట మొచ్చినట్టు ఖర్చు చేసుకుంటాను. మీ పుట్టిన రోజు ఇవాళ్టికి సరిగ్గా అయిదు రోజులుంది. ఈ రోజు వెళ్ళి టైలరుకి ఇచ్చేస్తే నాల్రోజుల్లో ఇచ్చేస్తాడు. వాటికి మొత్తం ఎనభై మూడు రూపాయలయింది. మిగతా డబ్బు కుట్టు కూలికి సరిపోతుంది. ఇది మీ పుట్టిన రోజుకి నా బహుమతి అన్నమాట!'

' అంది సుభద్ర గుక్కతిప్పుకోకుండా.

"సుభద్రా" అన్నాడు కమలాకరం సంతోషంతో. ఆ క్షణంలో అతనికి ఆమె దేవతలా కనిపించింది. పరిశీలించి చూడగా ఆమె కళ్ళు, ముఖం, నవ్వు అన్నీ అమాయకంగా కనిపించాయి.

తర్వాత కొద్ది నిముషాలకి కమలాకరం అనుకున్నాడు. భార్య ప్రేమ ప్రతిఫలాన్ని కోరదు. భర్త ఆనందమే ఆమె ఆనందం. ఇదివరకు సుభద్ర చీర కోసం మారాం చేసిందంటే అందుకు ఆమె అమాయకత్వమే కారణం. సాధారణంగా మారాం చేసే స్వభావం చిన్న పిల్లల్లో ఉంటుంది. ఆ స్వభావం అమాయకత్వానికి చిహ్నం. ఆ అమాయకత్వాన్ని తను స్వార్థంగా అర్థం చేసుకుని ఎంత పొరపాటు చేశాడు? నిజానికి ప్రతిఫలం కోరేది తల్లి మాత్రమే! వృద్ధాప్యంలో తన్ను ఆదుకుంటాడన్న ఆశతోనే తల్లి కొడుకుని ప్రేమిస్తుంది. ఆ స్వార్థం వల్లనే ఆమె ప్రేమలో అంతబలముంటుంది. భార్య ప్రేమ ముందు ఆమె ప్రేమ యేపాటిది?

కమలాకరం ఆ సాయంత్రం ఆ నిర్ణయానికి వచ్చినప్పటికీ అది స్థిరంగా నిలబడలేదు. రోజులు గడుస్తున్నకొద్దీ రకరకాల అనుభవాలు కలుగుతున్నకొద్దీ అతని నిర్ణయం అటూ యిటూ ఊగిసలాడసాగింది.

దుర్వ్యసనాలకు లోనై, మైకంతో తన్ను కొట్టినా కూడా ఆ కొడుకును పల్లెత్తుమాట అనకుండా ప్రేమించగలిగే తల్లిని అతను చూశాడు. తనెంతో అభిమానంగా చూసినప్పటికీ కొడుకు కోడలు వలలో పడి తన్ను సరిగా చూడడంలేదని గోలపెట్టే తల్లినీ అతను చూశాడు. రోజూ తాగి వచ్చి చావగొట్టే మొగుడి కోసం ప్రాణమిచ్చే భార్యను అతను చూశాడు. తన కోసం ప్రాణమిచ్చే మొగుడిని నిత్యమూ సాధించి మనస్థిమితం లేకుండా చేసే భార్యనూ అతను చూశాడు. ఇందులో ఎవరు మంచి? ఎవరు చెడు? ఈ విషయం తేల్చుకోవడం కష్టసాధ్యమే ననిపించింది.

ఆఖరికి అతను ఓ నిర్ణయానికి వచ్చాడు. ఇతరుల విషయాన్ని బట్టి తనకు ఏ విషయమూ నిర్ధారణ కాదు. ద్వేషిస్తూన్నట్లు అందరికీ కనిపించే తల్లి తన్ను నిజంగా ప్రేమిస్తున్నట్లు ఆమె కొడుక్కు తెలియవచ్చు. అందువల్ల చూసిందాన్నిబట్టి తను ఏ నిర్ణయమూ చేయలేడు. అనుభవం కావాలి. అనగా తను తన తల్లి, భార్యలలో తన్నెవరెక్కువగా ప్రేమిస్తున్నారో నిర్ణయించుకోవాలి. అందుకని అతను దగ్గర్లో ఉన్న భార్యను బహు శ్రద్ధగా పరిశీలించసాగాడు.

ఒక కాగితమూ, పెన్సిలూ ఇచ్చి అడుగుబద్ద సహాయం లేకుండా తిన్నని గీత గీయమంటే చాలా కష్టం. సాధారణంగా చాలా మందికి యెక్కువ వంకరలు వస్తాయి. ఎంత తిన్నగా గీసిన వాడి గీతలో కూడా యెంతో అంత చిన్న వంకర ఉండకపోదు. కాగితం పొడుగు పెరిగిన కొద్దీ వంకరలకు అవకాశమెక్కువవుతుంది. మొత్తం మీద గీత తిన్నగా కనిపించినా మధ్యలో వంకరలు లేవని మాత్రం అనలేము.

మానవ స్వభావమూ అటువంటిదే! ఒకే రకంగా ఎల్లప్పుడూ ప్రవర్తించడం మనిషికి

చాలా కష్టం. శాంత స్వభావుడని పేరెన్నికగన్న వ్యక్తి కోపగించుకున్న సందర్భాలుండకపోవు. కోపిష్టివాడుగా పేరొందినవాడు సైతం ఒక్కొక్కప్పుడు నలుగురూ ఆశ్చర్యపోయేటంత శాంతాన్ని ప్రదర్శించవచ్చు. అవి మానవ స్వభావంలోనే యిమిడివున్న లక్షణాలు.

తన్ను తన భర్త అనుక్షణమూ పరిశీలిస్తున్నాడని తెలియని సుభద్ర మామూలుగానే ప్రవర్తించేది. ఒక్కొక్కప్పుడు ఆమెలో అంతులేని స్వార్థం కనిపించేది. మరొకప్పుడు అద్భుతమైన త్యాగశీలత కనిపించేది. ఆమెను పరిశీలించిన కొద్దీ ఈ విభిన్న లక్షణాలు మరీ ఎక్కువగా కనిపించడం తప్ప కమలాకరం ఏ నిర్ణయానికీ రాలేకపోయాడు.

అతనింకా సందిగ్ధావస్థలో ఉండి తేరుకోకుండానే ఓ రోజున ఆమె భర్తకో శుభవార్త నందించింది. చిన్నవాడు కమలాకరం పెద్దవాడు కాబోతున్నాడు. అతనికి తండ్రి హోదా లభించడానికింక కొద్ది నెలలు మాత్రమే వ్యవధి ఉంది.

కమలాకరం నిజంగా చాలా సంబరపడిపోయాడు. అతను కొంతకాలంపాటు తన సమస్యను గురించి మర్చిపోయాడు. భార్యాభర్తల సంభాషణలో ఎక్కువగా పుట్టబోయే బిడ్డ చోటుచేసుకునేది. ఆ బిడ్డను గురించి చర్చిస్తూ ఉంటే ఇద్దరికీ కూడా ఏదో తెలియని సంబరం కలిగేది. ఒక్కొక్కప్పుడు సుభద్ర సిగ్గు పడేది. ఒక్కొక్కప్పుడు కమలాకరం సిగ్గుపడేవాడు. వాళ్ళ చర్చల్లో బోలెడు అనవసర ప్రసంగాలు దొర్లిపోయేవి.

బిడ్డ ఆడా, మగా అన్నదీ, రాబోయే పోలికలూ, ప్రవర్తనా, తెలివి తేటలూ, వాడిక్కూడా పెళ్ళయితే ఎలా ఉంటుందనీ..ఇలా రకరకాల చర్చలతో సుభద్రకు ఏడవ మాసం ఇట్టే వచ్చింది. ఓ శుభముహూర్తాన తల్లీ, తండ్రీ వచ్చి ఆమెను పుట్టింటికి తీసుకెళ్ళిపోయారు.

సుభద్ర వెళ్ళిపోయాక ఆమె విలువ కమలాకరానికి తెలిసి వచ్చింది. దీపం లేకపోయినా సుభద్ర ఉంటే ఇంట్లో కాంతి ఉండేది. ఆమె లేక దీపం ఉన్నా కాంతి లేనట్లు అనిపించసాగిందతనికి. "సుభద్రంటే ఎవరో కాదు...నేనే ఆమె!..నా శరీరంలో అర్ధభాగం వెళ్ళిపోయింది..." అనుకుని అతడు బాధపడ్డాడు.

ఆమె వెళ్ళిన ఓ పదిహేను రోజులకు అతనికి తల్లి ఉత్తరం వ్రాసింది. "ఒక్కడివీ వండుకుని ఏం తంటాలు పడతావు...నేను బయల్దేరి వస్తున్నాను" అని. ఉత్తరం చదువుకుంటూనే కమలాకరం సంబరపడ్డాడు. తన తల్లికి తన మీద ఎంత అభిమానమని!.. ఆ రోజునే తను బాగానే ఉన్నాననీ, భర్త ఆరోగ్యం గురించి ఆందోళన వ్యక్తపరుస్తూ. తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియపరుస్తూ సుభద్ర ఉత్తరం రాసింది. సుభద్ర చాలా పెద్ద ఉత్తరం రాసింది. తల్లి చాలా చిన్న ఉత్తరం రాసింది అయినా రెండింటి బరువూ సమానంగానే ఉన్నట్లు తోచింది కమలాకరానికి.

అక్కడ తండ్రికీ, మిగతా పిల్లలకూ వండిపెట్టడానికి మామ్మ ఉంది. మామ్మ ఏ పరిస్థితుల్లోనూ ఆ ఊరు విడిచి రాదు. అందుకని ఆమే తన కొడుక్కోసం బయల్దేరి వచ్చింది.

తల్లి వచ్చినప్పట్నుంచీ కమలాకరానికి చాలా హాయిగా ఉంది. అతనికిష్టమైన రకరకాల వంటకాలు చేస్తూ, సరదాగా కబుర్లు చెబుతూ ఉండేది. ఇదివరకులేని ఒక కొత్త

రకమైన ప్రశాంతత ఇంట్లో అలముకున్నట్లు అతనికి అనిపించసాగింది. అందులోనూ అతను తల్లి ప్రేమను ఇంతగా చవిచూసి కొన్నేళ్ళయిందేమో ఈ అనుభవం అద్భుతంగా ఉందతనికి. అలా నెల్లాళ్ళు గడచిన అనంతరం అతనికి హఠాత్తుగా తన సమస్య గుర్తుకొచ్చింది. వెంటనే అతను ఆమెను పరిశీలనా దృష్టితో చూడసాగాడు.

అంతే! అతనికి ఆమెలో పడగలు విప్పి బుస కొడుతున్న స్వార్థం ఒకసారీ, భగవంతుడికి తప్ప సాధ్యంకాని త్యాగశీలత ఒకసారీ కనిపించింది. పట్టకంలో చూస్తే తెల్లటి కాంతిలోని విభిన్న వర్ణాలు కనిపిస్తాయి. కమలాకరం దృష్టి పరిశీలనా పట్టకం ద్వారా ప్రసరించడంతో తల్లి ప్రేమలోని విభిన్న వర్ణాలు కనిపించసాగాయి.

ప్రవర్తనలో ఆమెకూ, సుభద్రకూ తేడా లేదు. మరో నెలలోనే కమలాకరం తండ్రి అయ్యాడు. కానీ సెలవు దొరకని అతను సుపుత్రుణ్ణి వెంటనే చూసుకునే అదృష్టానికి నోచుకోలేదు. కుర్రాడు మంచి నక్షత్రంలో పుట్టాడనీ, శాంతి వగైరాలు అవసరంలేదనీ మామగారి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. కుర్రాడికి మూడో నెల వచ్చేక సుభద్ర కొడుకుతో మళ్ళా కమలాకరం దగ్గరకు వచ్చేసింది. మనవణ్ణి చూసి ముచ్చటపడిపోయిన కమలాకరం తల్లి లక్ష్మిందేవమ్మ భర్తకు ఉత్తరం రాసింది - పండులాంటి మనవణ్ణి చూడ్డానికి రావలసిందని. ఊళ్ళో పనులు హడావుడి వుండడం వల్ల రాలేనని ఆయన జవాబు రాసేడు.

కమలాకరానికిప్పుడొక కొత్త రకం అనుభవం. అతనికి సుభద్రలో మార్పు కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. ఆ కుర్రాడే ఆమెకు లోకమైపోయాడు. ఆఫీసు నుంచి రావడం అరగంట ఆలస్యమైతే బుంగ మూతి పెట్టే సుభద్ర గంట లేటుగా వచ్చినా, 'అరే అప్పుడే అయిదయిందా!' అని ఆశ్చర్యపోతోంది. ఎప్పుడు చూసినా బాబుని గూర్చి కబుర్లే. అత నింటికొచ్చేరికి బాబుని గురించిన విశేషాలు వందల కొద్దీ సిద్ధంగా ఉండేవి. నవ్వేడనీ, బోర్ల పడ్డాడనీ. చీర పాడు చేశాడనీ...మనవడి ముచ్చటలు చూసిన లక్ష్మిందేవమ్మకూ ఇంటికి వెళ్ళ బుద్దేయలేదు. కొడుకుతో ఒక్కర్తీ చేసుకోవడం కష్టమని గ్రహించిన సుభద్ర కూడా అత్తగారు వెళ్ళిపోవడానికొప్పుకోలేదు. అందువల్ల తండ్రిని రావలసిందిగా మళ్ళీ ఉత్తరం రాశాడు కమలాకరం.

ఈసారి కమలాకరం తండ్రి జానకిరామయ్యగారు వచ్చేశాడు. చదువుకునే పిల్లలకు వండి పెట్టడానికి తన తల్లిని వదిలేసి వచ్చిన రోజున ఇన్నాళ్ళూ భార్య కొడుకు దగ్గర మకాం వేసినందుకు చిరాకు పడ్డాడుగానీ మర్నాటి నుంచి ఆయనకూ ఇంటికి వెళ్ళాలనిపించలేదు.

కుర్రాడికి ఆరో నెల వచ్చి కొంచెం పాకడం మొదలుపెట్టాడు. అప్పటికి తను వచ్చి నెల దాటడం చేత..జానకిరామ్యగారు వెళ్ళిపోయారు. కొడుకూ, కోడలూ బ్రతిమలాడగా మరో రెండు వారాలపాటు లక్ష్మిందేవమ్మ అక్కడనే ఉండడానికి ఆయన అనుమతించాడు.

కుర్రాడు పాకడం మొదలుపెట్టేక కమలాకరానికి సుభద్ర ప్రవర్తన మరీ వింతగా కనిపించసాగింది. అతనింటికి రాగానే ఆమె బాబు మీద వందలకొద్దీ ఫిర్యాదులు చేసేది. కష్టపడి ఏరిన బియ్యం కలిపేశాడనీ, కందిపప్పు డబ్బా బోర్లించేశాడనీ, గిన్నెలన్నీ

వాయించేస్తున్నాడని - కమలాకరం తాలూకు కాగితాలు కొన్ని నమిలేశాడనీ.. ఇన్ని ఫిర్యాదులు చెప్పినా ఆమెలో బాబు మీద కోపం కనిపించేది కాదు. కేవలం ఆప్యాయత మాత్రమే! తన భార్య తనకు దూరమైపోతోందన్న భావం కలిగిందతనికి.

అతన్ని గురించి పట్టించుకోవడం పూర్తిగా మానేసిందామె. అప్పుడు కమలాకరం గ్రహించాడు. సుభద్రకు తన మీద కంటే తన బాబు మీదే ఎక్కువ ప్రేమ అని. అతని సమస్యకు సమాధానం దొరికినట్లనిపించింది. కానీ...ఆమెకు బాబు మీద ఈ ప్రేమ కలకాల ముంటుందా అన్న సందేహం కూడా అతనికి రాకపోలేదు.

ఉన్నట్లుండి కమలాకరానికి జబ్బు చేసింది. ముమ్మరంగా వచ్చేసింది జ్వరం. సుభద్ర, లక్ష్మిందేవమ్మ కూడా బాగా కంగారుపడిపోయారు.పిల్లాడి ఆలనా పాలనా కూడా సరిగ్గా చూడకుండా సుభద్ర అతనికి సేవలు చేయబోతూంటే లక్ష్మిందేవమ్మగారామెను వారించి స్వయంగా దగ్గరుండి కమలాకరాన్ని చూసుకునేవారు. రెండ్రోజులైనా జ్వరం ఓ దారికి రాలేదు.

ఇంతలో ఉత్తరం వచ్చింది. జానకిరామయ్యగారికి వంట్లో నలతగా ఉందిట. వెంటనే లక్ష్మిందేవమ్మగారు వెనకా ముందూ ఆలోచించ లేదు. "నేను అర్జంటుగా వెళ్ళిపోవాలి. అవతల ఆయన కెలాగుందో ఏమిటో. అత్తగారు వయసు మళ్ళినవారు. ఆవిడేం చూసుకుంటారు. అబ్బాయిని నువ్వు జాగ్రత్తగా చూసుకో" అంటూ ఆవిడ ఆ సాయంత్ర మే ట్రయినెక్కి వెళ్ళి పోయింది. సుభద్ర బ్రతిమాలినా ఆవిడ ఆగలేదు. మరీ యెక్కువగా బ్రతిమాలినా బాగుండదని గ్రహించిన ఆమె ఊరుకుంది.

జ్వరంలో ఉన్నా తల్లి మాటలు విని అర్థం చేసుకోగలిగాడు కమలాకరం. ఇంతకాలమూ తను తన తల్లి గురించే ఆలోచిస్తున్నాడు. తన తండ్రి, ఆమెకు భర్త అనీ, ఆమెకు తన కంటే ఆయనే యెక్కువని తనకు తట్టలేదు. తనకూ జబ్బు చేసింది. తండ్రికీ జబ్బు చేసింది. తల్లి ఏం చేసింది? తన భర్త దగ్గరికే వెళ్ళింది. కారణం..తల్లిగా ఆమె తనను ప్రేమించినదానికంటే, భార్యగా తన భర్తను ఆమె ఎక్కువ ప్రేమిస్తోంది. ఏ పరిస్థితుల్లోనూ ఆమె తన కోసమని తండ్రిని వదులుకోలేదు. కాబట్టి...ఎవరి ప్రేమ గొప్పది?

అతనికి తలనొప్పి వచ్చింది.

మర్నాటి సాయంత్రానికి అతని జ్వరం దిగజారిపోయింది., కానీ మనిషి కొంచెం చిరాగ్గా ఉన్నాడు. ఆ సమయంలో బాబు పాక్కుంటూ వచ్చి అతని కాళ్ళు లాగాడు. అతనికి చిరాకేసి కాలు కొంచెం విసిరాడు. కుర్రాడు వెల్లకితలాపడి ఏడుపు మొదలెట్టాడు. అక్కడే ఉన్న సుభద్ర చట్టుక్కున పిల్లాడి నెత్తుకుని విసుగ్గా భర్త వంక చూసింది. "ఏం మనిషండీ మీరు.. మీ చిరాకంతా చూపించడానికి వీడు తప్ప దొరకలేదా?" అంటూ ఆవేశంతో ఇంకేం మాట్లాడాలో తెలియక ఆగిపోయింది.

కమలాకరం విచిత్రంగా ఆమె వంకే చూస్తున్నాడు. అతన్ని ఆకర్షించింది ఆమె చూపు. ఆ చూపులో.."మరోసారి పిల్లాణ్ణి తన్నేరంటే..జాగ్రత్త!" అన్న హెచ్చరిక కనిపిస్తోంది. తన మీద

ఎక్కడా కరుణాపూరిత భావం కనబడ్డం లేదు. అదే క్షణంలో అతనికి నిన్నటి దినం తల్లి తన వంక చూసిన చూపు గుర్తుకొచ్చింది. "ఆయనకంటే వీడు ముఖ్యమా.." అన్న భావం అందులో కొట్టొచ్చినట్లు కనిపించింది.

కమలాకరానికి ఆ క్షణంలో తన తెలివితక్కువతనం అర్థంకాగా జ్ఞానోదయమైంది. తల్లి ప్రేమ గొప్పదా, భార్య ప్రేమ గొప్పదా అన్న సమస్యకు సమాధానం లేదు.

సూర్యకాంతి శీతాకాలంలో మనకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. ప్రతి మనిషీ సూర్యకాంతిలో తిరగడానికి కుతూహలపడతాడు. అదే సూర్యకాంతి యెండాకాలంలో భరించలేనిదైపోతుంది. ప్రతివాడూ దాని నుంచి పారిపోవాలని ప్రయత్నిస్తాడు. ఈ రెండు కాలాల అనుభవాన్ని బట్టి సూర్యకాంతి మంచిచెడ్డలను నిర్ణయించలేము. జగత్తుకంతకూ శక్తిని ప్రసాదించే సూర్యకాంతి ఏ కాలంలోనయినా మంచిదే.

అదే విధంగా మన అనుభవాల్ని బట్టి తల్లి, భార్యల్లో యెవరి ప్రేమ గొప్పదనే విషయానికి సమాధానం దొరకదు. ఎందుకంటే ప్రేమలో తల్లి ప్రేమ అనీ, భార్య ప్రేమ అనీ యిన్ని రకాలు లేవు. అజ్ఞానులైన మానవులు అనేకరకాల దేవుళ్ళను సృష్టించినట్లే అనేక రకాల ప్రేమలను సృష్టించారు. కానీ ప్రేమ ఒక్కటే!

భార్యాభర్తల మధ్య ఉండే మోహాన్ని ప్రేమ అని కొంతమంది తప్పుగా పిలుస్తూంటారు. మోహం కేవలం వయసుకు సంబంధించినది. మోహం ఏనాటికీ ప్రేమ కాజాలదు. భర్త జబ్బునపడి ఉన్నప్పుడు భార్య అతని కోసం తన సర్వస్వాన్నీ ధారపోయడానికి సిద్ధపడుతుంది. ఆ ధారపోయడంలో ఆమె తన ఉనికినే మరిచిపోతుంది. తన్ను తాను త్యాగం చేసుకుంటుందన్నా ఆశ్చర్యం లేదు. అందులో మోహం లేదు. అదే అసలైన ప్రేమ. ఆ ప్రేమనే తల్లి తనయుడి మీద చూపిస్తుంది. దేశభక్తుడు దేశం మీద చూపిస్తాడు.

భార్య భర్తను ప్రేమిస్తుంది. ఆ భార్యే తల్లిగా మారి తనయుడిని ప్రేమిస్తుంది. అప్పుడే పుట్టిన బిడ్డను ఆమె అమితంగా ప్రేమిస్తుంది. ఆ క్షణంలో ఆమె హృదయంలో భర్త కంటే బిడ్డకే ఎక్కువ చోటుండవచ్చు. కానీ కాలం గడిచిన కొద్దీ ఆమె హృదయంలో మళ్ళీ భర్తకు స్థానం పెరుగుతుంది. ఎవరు దయనీయ స్థితిలో ఉంటే వారిని ఎక్కువ ప్రేమించే స్త్రీ ప్రేమలో ఒకే ఒక ప్రత్యేకత మాత్రం ఉంది. ఆమె ప్రేమ ఆమె భర్తకూ, బిడ్డలకూ, మాత్రమే పరిమితం. వారిని ప్రేమించినంతగా ఆమె మరెవ్వరినీ ప్రేమించలేదు.

రాడ్ లేవర్ మళ్ళీ వింబుల్డన్ నెగ్గాడు. గారీఫీల్డ్ సోబర్స్ మళ్ళీ సెంచరీ కొట్టాడు. కర్ణాటక సంగీత దర్శకులు పాశ్చాత్య సంగీతబాణీలను అనుసరించి అంతులేని పేరు తెచ్చుకుంటున్నారు. కర్ణాటక సంగీత విద్వాంసులు పాశ్చాత్య దేశాలలో అంతులేని ఖ్యాతి నార్జిస్తున్నారు.

కమలాకరాన్ని ఆ తర్వాత మరెన్నడూ ఈ రెండు ప్రేమల సమస్య బాధించలేదు.★

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక - 6-11-'70)*